కథ

సివి(ని)క్ సెన్స్

చీమలమర్రి శ్రీనివాసమూర్తి

చిదంబరానికి చిర్రెత్తు కొచ్చింది. ఒక పత్రికతోపాటు అప్పుడే కొన్న రైల్వేటైంటేబుల్‌ను నేలకేసి కొట్టాలనిపించింది. చుట్టూఉన్న వాళ్ళు చూస్తే బాగుండదని ఆ ప్రయత్నం మానుకున్నాడు. వచ్చేముందు వాకబు చేస్తే రైట్‌టైం అన్నారు. తీరా వచ్చి చూస్తే అర్ధగంట లేటని బోర్డ్ మీద రాశారు. రైల్లో సమయం గడపటం కోసం ఏదైనా పత్రిక కొందామని రైల్వేబుక్‌స్టాల్‌కు పోతే కొత్త టైంటేబుల్ దర్శనమిచ్చింది. అలవాటు ప్రకారం టైంటేబుల్ కూడా తీసుకున్నాడు. ఈ బండి తప్ప మరేబండి కూడా సమయానికి గమ్యం చేర్చలేదు. అవతల ఆప్తమిత్రుడి పెళ్ళి. ఆలస్యంగా వెళితే నిష్ఠూరాలు చీవాట్లు తప్పవు. అర్ధగంట తర్వాతైనా బండి వస్తుందనే నమ్మకం లేదు.

హతాశుడై. కొద్దిదూరంలో ఖాళీగావున్న సిమెంటు బెంచీవైపునడిచాడు. అప్పటికే ఒకతను కూర్చున్నాడు కాళ్ళ ప్రక్కగా సూట్‌కేసు పట్టుకుని. తను కూడా కూర్చుని టైంటేబుల్‌ను ప్రక్కనే వుంచి పత్రిక తీసుకున్నాడు. జనం రద్దీ పెరుగుతున్నట్లనిపించింది. రైలు లేటు ఎక్కువయే కొద్దీ జనం పెరగటం మామూలే. ముందుగానే సీటు రిజర్వుచేసుకున్నందుకు తనను తానే మనసులో అభినందించుకున్నాడు. పత్రికను ఆసాంతంఒక సారి చూసి, ప్రక్కన కూర్చున్నాయనను మాటలలో దింపాడు టైంపాస్ కోసం.

"మీరు కూడా హైదరాబాదే నాండీ?

"అవును-మీరో? అర్ధంలేని ప్రశ్న.

అక్కడికే. నా స్నేహితుడి పెళ్ళి. రైలు వ్యవహారం చూస్తే అందుకునేట్లు లేదు. ఈ దరిద్రపు రైళ్ళు ఏనాడూ టయానికి రావు" అన్నాడు విసుగ్గా'

"టైంటేబుల్ కూడా కొన్నట్లున్నారు"

"అవును అది మొదటి నుంచీ నా అలవాటు. ఈ మధ్యవేళలు మారాయి గదా!.

"ఏం ప్రయోజనం. రైళ్ళు సమయానికి రానప్పుడు దానితో పనేముంది?" అతనెందుకో చిరునవ్వునవ్వినట్లు అనుమానమేసింది. నేను మాట్లాడలేదు.

"మనదరిద్రపు రైళ్ళు ఎప్పుడూ యింతేనండి. టైముకురావు. టైముకు చేరవు. పేరుకు ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్‌ఫాస్ట్‌లు. నడిచేది నత్తనడక. మధ్యమధ్యలో ఎవడో చైన్ లాగుతుంటాడు. ఆగితే ఐదునిముషాల దాకా కదలదు. ట్రాక్ రిపేర్లంటూ, బలహీనమైన వంతెనలంటూ ఔటర్‌సిగ్నల్ దగ్గర పదిపదిహేను నిముషాలు పడిగాపులు. ప్రయాణం అంటే భయమేస్తోంది. నిలదీసి అడిగే నాధుడులేడు. అడిగినా వినేవాడులేడు. కంప్లెయింట్ బుక్కంటూ ఒకటి వుంటుంది. ఏదో పొడిచి గెలుస్తామన్నట్లు ఎనౌన్స్‌మెంట్లు అందులో రాసినా అతీగతి వుండదు. అంతా మన ఖర్మ అనుకుంటూ వేదాంతధోరణిలో బ్రతకటం మనకు అలవాటైపోయింది"

చిదంబరానికి అవతలి వ్యక్తి మీద అమితమైన అభిమానం వెల్లువెత్తింది. తనలాగే ఆలోచించే వాళ్ళుయింకా ఈదేశంలో చాలామంది వున్నారనిపించింది. కాని సంఘటితంగా ముందుకొచ్చి నిలదీసే ధైర్యంగానీ సమయంగానీ ఓపికగాని జనానికి లేవేమో!

"మీరేం చేస్తుంటారు?" చిదంబరానికి తెలుసుకోవాలనిపించింది. "అడ్వకేట్‌ని" అన్నాడు అవతలివ్యక్తి.

చిదంబరానికి అర్ధమైంది. యింత అనర్గళంగా గుక్కతిప్పుకోకుండా మాట్లాడగల డంటే ఛోటామోటా రాజకీయ నాయకుడైనా అయివుండాలి పంతులైనా అయివుండాలి. వకీలుగారైనా అయివుండాలి.

...

"మీరు యిక్కడే ప్రాక్టీసు చేస్తున్నారా?"

"అవును పదేళ్ళనుంచి"

"ఫరవాలేదా? అదే ప్రాక్టీసు".

ఏం ప్రాక్టీస్! నాబొంద ప్రాక్టీసు. యిప్పుడంతా చాంబర్ ప్రాక్టీసు నడుస్తోంది. చట్టంవేరు, న్యాయంవేరు, ధర్మంవేరు. కోర్టుల్లో కేసులుపేరుకు పోతున్నాయి. ఆమధ్య ఎవరో సుప్రీంకోర్టు న్యాయమూర్తి అన్నాడు. యిప్పుడున్న పద్ధతిలో న్యాయవ్యవస్థ నడిస్తే యింకా మూడొందల ఏళ్ళుపడుతుందట. మాగ్జిమమ్ శిక్షా కాలం పూర్తయినా యింకా విచారణపూర్తి కాని ఖైదీలున్నారంటే ఆశ్చర్యమేస్తుంది. కేసుపెట్టినవాడు బ్రతికున్న కాలంలో తీర్పు వస్తుందనే ఆశలులేవు. మనం ఎక్కడున్నామో ఎక్కడికి పోతున్నామో అర్ధం కాదు. న్యాయంగా ప్రాక్టీసు చేసేరోజులు పోయాయి. "ప్చ్" అన్నాడు.

టైమయింది. అయినా ఎనౌన్స్‌మెంటు లేదు. లేటు యింకా పెరిగిందేమో చూద్దామని యిద్దరూ లేచినడిచారు. పొడిగించినట్లు కనపడలేదు. తమగడియారాలను రైల్వేగడియారంతో సరిచేసుకుని చూసుకున్నారు. అక్కడెవరో నల్లకోటాయన కనబడితే అడిగారు. తనకేమీ తెలియదని స్టేషన్‌మాస్టారున్న రూంకేసి చూపించాడు. యిద్దరిలో సహనం నశించింది. నేరుగా స్టేషన్ మాస్టర్‌గారి రూంలోకి ప్రవేశించారు.

రిటైర్మెంటుకు దగ్గరగా వున్నట్లున్న తెల్లజుట్టువ్యక్తి కుర్చీలో కూర్చుని ఏవో పేపర్లు సర్దుతూ కన్పించాడు. పూర్తి తెలుపు బట్టలలో అప్పుడే లాండ్రీ షాపు నుండి బయటి కొచ్చినట్లున్నాడు.

"ఏమిటండీ యిది. మొదట

పదినిముషాలన్నారు. అది కాస్తా అర్ధగంటయింది. తరువాత గంటయింది. అసలు వస్తుందా రాదా తెలియదు. ప్రయాణీకులు ఎంత యిబ్బందిపడతారో ఆలోచించారా? అత్యవసరపనులమీద పోయేవాళ్ళు ఎందరో వుంటారు. వాళ్ళగతేంగాను?" లాయర్‌గారు దుమ్ములేపారు.

స్టేషన్ మాస్టరుగారు అంతకుముందే 'టీ' ఆర్డరిచ్చారేమో క్యాంటీన్ కుర్రాడు ట్రేలో నాలుగైదు టీలతో ప్రత్యక్షమైనాడు.

"అసలు మీరైళ్ళు ఎప్పుడొస్తాయో మీకే తెలియనప్పుడు ఈ టైంటేబుల్స్ ప్రింట్ చేసి అమ్మటమెందుకండీ దండగ" చిదంబరం కూడా లాయరుగారితో శృతికలిపాడు.

ముసలాయన చిద్విలాసంగా చిరునవ్వునవ్వాడు. ఒక చేత్తో టీగ్లాసు అందుకుంటూ కూర్చోమన్నట్లు కుర్చీలు చూపించాడు. క్యాంటీన్ కుర్రాడితో వారిద్దరికీ చెరొక టీయివ్వమన్నట్లు సైగచేశాడు.

మేం యిక్కడికి 'టీ'లు తాగటానికి రాలేదండీ. హైదరాబాద్‌లో అత్యవసర పనులుండి బయలుదేరితే యిక్కడ యిరుక్కుపోయాం. ఎప్పుడూ లేటే"

ఆయన నింపాదిగా కూర్చున్నాడు.

"చూడండి ఆ టైంటేబుల్ అంటూ ఒకటి వుంది కాబట్టి, అందులో రావాల్సిన వేళలు పోవాల్సిన వేళలు రాసివున్నాయి కాబట్టి, మీరు వచ్చినన్నునిలదీసి అడగగలుగుతున్నారు. మంచిదే నిలదీయాల్సిందే. కాని ఆ టైంటేబుల్ అనేది ఒకటి మీచేతుల్లో లేదనుకోండి. అప్పుడెలా అడగగలుగుతారు?

మీరు అడిగే అవకాశంలేదు. నేను చెప్పాల్సిన అవసరమూ ఉండదు. మన చట్టాలు కూడా అలాంటివే. గుడ్డిదో మెల్లదో చట్టమంటూ ఒకటి ఉన్నది. కాబట్టి అమలు ఎందుకు కావటం లేదని అడిగే హక్కుమీకొస్తుంది. హక్కును ఉపయోగించుకుంటారా లేదా అన్నది మీ స్వవిషయం. అడిగే వాళ్ళు లేకపోతే అమలు చేయాల్సిన వాళ్ళు కూడా అశ్రద్ధ చూపుతారు. ప్రజాస్వామ్యంలో 'నిలదీసే' ధైర్యంలేనంత వరకు వ్యవస్థమారదు. "యిందాక తాము చట్టాలగురించి, కోర్టుగురించి మాట్లాడుకునేటప్పుడు విన్నాడా?"

యిరువురూ నిలువు గుడ్లేసి కూర్చున్నారు.

"యిక మీరు అడిగారుగాబట్టి చెప్తున్నాను. మధ్యదారిలో ఎవరోట్రాక్ ఫిష్ ప్లేట్లను తొలగిస్తే, వాటిని సరిదిద్దిరావటానికి టైం పడుతుందంటే పదినిమిషాలు లేటురాశాం. యింకో స్టేషన్‌ముందు ఎవరో కదులుతున్నప్పుడు దిగబోయి పట్టామీదికొచ్చాడు. అది దాటుకుని ముందుకొస్తే 'రైలురోకో' అంటూ కొందరు జనాలు రైలు పట్టాలమీద పడుకున్నారు. అందుకని గంటలేటని బోర్డ్ మీద రాశాం. అక్కడ 'రోకో' ఆగితేగానీ రైలు బయలుదేరదు. దానికి పోలీసులు రావాలి, వాళ్ళకు నచ్చచెప్పి పంపించాలి. వినకపోతే లాఠీచార్జి చేయాలి. అప్పుడు బయలుదేరాలి. యిదంతా ఎప్పటికవుతుందో మాకుమాత్రం ఎలా తెలుస్తుంది?

తమాషా ఏమిటంటే హక్కులకోసం పోరాడేవారు, బాధ్యతలు గుర్తించరు. గతంలో యధారాజా తధాప్రజా అనేవారు. యిప్పుడూ యధాప్రజా తధారాజా అయింది ప్రజాస్వామికంలో. అరెరే మీ టీలు చల్లారిపోతున్నాయి తీసుకోండి. తర్వాత తీరికగా మాట్లాడుకుందా..

అరె! వెళ్ళిపోతున్నారా.. టీ తీసుకొని వెళ్ళండి.

సృజనయాగం

డా॥ సి.నారాయణ రెడ్డి

ఎంతసేపైనా నేనిలాగే కూర్చుంటాను
కదులుతున్న కాలానికి విసుగొచ్చి
నారెండు చేతులు పట్టి లేపేవరకు.
నేనిలా కూర్చోవడం
అలసత్వం ఆవరించి కాదు
ఏ యోగముద్రలోనో ఊపిరిబంధిగా
దిగబడి వున్నందుకు కాదు.
మరెందుకు?
పొరలు గమ్మిన ఆలోచనలకు
పదును పెట్టడానికి
కూర్చొని వున్నప్పుడు
నా మనసులో రకరకాల మెరుపులొస్తుంటాయి
వాటిని అక్షరాల్లోకి ఎక్కించినప్పుడే
నాలో సరికొత్త ఉద్దీప్తి పుడుతుంది
అప్పుడు నా పెదవులపైన మొలిచే చిరునవ్వు
నాలోని సృజనాత్మక సంతృప్తికి
అభివ్యక్తి రేఖ.
నేను కూర్చుంటానే గానీ
నా చూపులు
ఏ మాత్రం కూర్చోవు.
అవి వాయువలయాన్ని చుట్టుముట్టి
గగన మండలం వరకు దూసుకుపోతాయి.
తాము సేకరించిన విశేషాలన్నీటినీ
నాదాకా చేరవేస్తాయి.
ఆ సామాగ్రినంతటినీ నా కలంలో నింపుకొని
ఆశ చావక
నేను సకల ప్రకృతిని నాలోకి
చేదుకుంటూ వుంటే
ఈ పూటతో మీ 'సృజనయాగం' చాలించండని కాలం
నాచేతులు పట్టిలేపింది.
లేచి చూసేపరికి నా ఎదుట నిలబడ్డాయి
అక్షరాకృతిలో వున్న అసంఖ్యాక కవితాత్మలు